# శస్త్ర చికిత్స

సుస్మితా రమణమూర్తి

నరసింహ గదిమధ్యలో ఉన్న బల్లపై తనచేతిలోఉన్న పుస్తకాన్ని విసురుగా పడేసి గట్టిగా అరిచాడు. పైకప్పు పెంకులు అదిరిపోయేలా అరిచాడు. అలా అరిచినందుకు ఆ గదిలో ఉన్న శ్రీకాంత్ శ్రీధర్‌లు ముఖాలు ప్రశ్నార్థకాల్లా మారలేదు.

వాళ్ళ బుర్రల్లో ప్రశ్నలు–సమాధానాలు, సమస్యలు – పరిష్కారమార్గాలు, పగ–ద్వేషం. ఎప్పటికప్పుడు ఎంత జాగ్రత్తగా వుందామనుకున్నా అలా ఉండలేకపోతున్నందుకు తమపై తమకే జాలి.

బాగా చదువుకున్నవాడు – కాలేజీలో భావి భారత నిర్మాతలకు పాఠాలు చెబుతున్నవాడు – రెండు చేతుల్తోను సమాజాన్ని ఉద్ధరించే కథలు కాకపోయినా నేటియువ తరాన్ని సర్కస్‌ఫీట్స్‌చేయిస్తున్న బాయ్‌మీట్‌గార్ల్ కథల్ని కొల్లలుకొల్లలుగా రాసిపడేస్తున్నవాడు – అచ్చులో పేరు చూసుకోవాలనే తాపత్రయం లేనివాడు – ఎన్నో ఏళ్ళనుంచి మిత్రుడయ్యుండికూడా మాకే ఎసరుపెడ్తాడా? అన్యాయం! అక్రమం! ఇక సహించేది లేదు, వాడి ఆట కట్టించాలి. వాడి బ్రతుకుని సాహితీలోకానికి చాటిచెప్పాలి!... ఆ గదిలో కూర్చున్న ముగ్గురిలోనూ అదే ఆవేదన! అదే ఆలోచన! అదే సమస్య!

ఎప్పటికప్పుడు వాళ్ళ అలా బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నప్పటికీ 'ఫలానా విధంగా చేస్తే బావుంటుంది' – అన్న నిర్ణయానికి ఎవరూ రాలేకపోతున్నారు.

ఆ ముగ్గురూ రచయితలే! వారికి మిత్రుడు ప్రభాకర్! తనూ రచయితే!

ఆరేళ్లనుంచీ వారి స్నేహం సాగుతోంది.

ప్రభాకర్ ఏదో కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాడు.

మిగతావాళ్లూ ఉద్యోగస్తులే!

ఆదివారాలు మిగతా సెలవుదినాల్లో ముందుగా అనుకుని ఎవరో ఒకరింట్లో కల్సుకోవడం వారి అలవాటు.

కల్సుకున్న ప్రతిసారీ తాము రాయబోయే కథల గురించి – రాసిన వాటిగురించి చర్చించుకుంటారు.

ప్రభాకర్ రాసేవి ఇద్దరమ్మాయిలూ – ముగ్గురబ్బాయిలూ లాంటి ప్రేమ పకోడీలే అయినా యమ స్పీడుగా రాసిపడేస్తుంటాడు. మిగతా ముగ్గురూ సామాజిక స్పృహగల కథలుకూడా రాయాలన్న తపనగలవాళ్ళు. కథ 'రఫ్' రాసేంతర్వాత కనీసం ఓ నెల్రోజులైనా దానిగురించి బాగా ఆలోచించిన మీదటే 'ఫెయిర్' చేసి పత్రికలకు పంపిస్తుంటారు. ప్రభాకర్ మాత్రం రాత్రికి రాత్రే కథ రాసేసి మర్నాడు ఫెయిర్ కాపీని ఏదో ఒక పత్రిక్కి పంపేదాకా నిద్రపోడు. నలుగురూ కల్సుకున్నప్పుడు ప్రచురణకు పంపేసిన కథల 'రఫ్ కాపీ'లే తీసుకువెళ్తాడు గాని– ఎప్పుడూ తను రాయబోయే కథ ఫలానా అని చెప్పడంగాని – ఫెయిర్ కాపీని మరొకరికి చూపించడంగాని ప్రభాకర్ చేయడు.

నలుగురిలోనూ ప్రభాకరే కాస్త సీనియర్ రచయిత కావడంవల్ల అంతవరకూ ప్రచురణ జరిగిన కథల సంఖ్య తనవే ఎక్కువ కావడంవల్ల మిగతా ముగ్గురూ తన సలహాలు తీసుకోవడం – తమ కథల బాగోగుల్ని చూసేందుకు పత్రికలకు పంపబోయే ఫెయిర్ కాపీలు తనకు ఇవ్వడం చేస్తుంటారు.

నెలరోజులక్రితం అలా తను పం[illegible]యే కథ ఫెయిర్ కాపీని నరసింహం ప్రభాకర్‌కి ఇ[illegible]డు. ఇంకా చదవ లేదంటూ ఓ నెల్రోజులు ము[illegible]కి దొర్లించేశాడు ప్రభాకర్. ఇప్పటికీ ఆ కథ నరసింహం చేతికి రాలేదు. మనిషికూడా కన్పించడంలేదు.

ఆ కథ ఇప్పుడు నరసింహం చేతికి పరోక్షంగావచ్చింది. ఎలా వచ్చింది? ప్రభాకర్ తీసుకొచ్చివ్వలేదు.

అదేకథ కొద్దిపాటి మార్పులతో తనపేరుమీదుగాకాకుండా ప్రభాకర్‌పేర్న ఓ పత్రికలో ప్రచురణ కావడంతో కోపంతోనే మండిపోతున్నాడు నరసింహం.

ఆ కోపంతోనే అరుస్తున్నాడు. పెంకులెగిరిపోయేలా అరుస్తున్నాడు . నరసింహంకి ప్రభాకర్‌ద్వారా ఇలాంటి అనుభవం మొదటిసారేగాని మిగతా ఇద్దరికీ ఈ విషయం కొత్తేమీ కాదు. తాము రాయబోయే కథలు టూకీగా చెప్పడం – వారికంటే ముందు ఆ కథల్ని అర్జంటుగా బరికేసి పత్రికలకు పంపడం – వారు కథల్ని రాస్తున్న సమయంకి ఆ కథలు ప్రభాకర్ పేర్న అచ్చయి పత్రికల్లో దర్శనమివ్వడం జరిగింది – మిగతా ఇద్దరి విషయంలో.

అప్పుడు నరసింహంకి వాళ్ళు చెప్పినా పట్టించుకోలేదు. తనదాకా వచ్చేదాకా పరిస్థితిని – ప్రభాకర్‌లోని మరోమనిషిని అర్థం చేసుకోలేకపోయాడు నరసింహం.

ప్రేమ పదార్థం చుట్టూ అమ్మాయిల్నీ – అబ్బాయిల్నీ పిల్లిమొగ్గలు వేయించడానికి అలవాటుపడిన ప్రభాకర్‌కి తనచుట్టూ ఉన్న సమాజాన్ని పరిస్థితుల్ని గమనించే ఓపిక – సామాజిక స్పృహతో కథలు రాయాలన్న తపన ఆలోచన లేవు.

తన కథల్ని టీనేజర్స్‌బాగా 'ఫాలో' అవుతున్నారు. అంతో ఇంతో రచయితగా తనకు పేరుంది. తన కోవ తనది. మరొకరి కోవలో పయనించడం దేనికి? ఎవరి ఆలోచనలు వారివి. ఎవరి దారి వారిది – అంటూ చాలాకాలం అభిప్రాయపడ్డాడు.

తన దృక్పథంలో ఇటీవలే కొంత మార్పొచ్చింది. నిన్నకాక మొన్న కథలా్రయడానికి పూనుకున్న వారుకూడా సామాజికస్పృహగల ఇతివృత్తాలనే ఎన్నుకుంటున్నప్పుడు ఎన్నో ఏళ్ళనుంచి రాస్తున్న తనెందుకు అలాంటి కథలు రాయలేదు? తప్పకుండా రాయగలడు. రాసి తీరాలి. ప్రభాకర్‌లో అలాంటి నిర్ణయం చోటుచేసుకొన్నా సమాజాన్ని అందులోని మనుషుల్ని – వారి పరిస్థితుల్ని నిశితంగా పరిశీలించే ఓపిక – సహనం అతనికి లేకపోవడంవల్ల అదోలా ఫీలై 'ఆ మార్గవే' సుగమవని తలచాడు.

"చూశారా వాడి ఆగడం? పోస్ట్ చేయబోయే కథని తనపేర్న పంపు[illegible]న్నాడు! వాడి భాగోతాన్ని బట్టబయలు చేయాలి!" నరసింహం కోపంతో రెచ్చిపోతూ అన్నాడు.

"ఇప్పుడు మనమేమీ చేయలేం! ఆ కథ రాసింది నీవని చెప్పుకున్నా ఎవరూ నమ్మరు. కాస్త శాంతంగా ఆలోచించి చేయాల్సిందేదో గుట్టుచప్పుడుకాకుండా చేయాలి." శ్రీధర్ నిదానంగా చెప్పాడు.

"అవును. నీవు చెప్పిందీ నిజవే! అయితే ఇప్పుడేం చేయాలి?"

"ఏమీ జరగనట్లు ఊరుకుందాం. ఎప్పటిలాగే ప్రభాకర్‌తో ఫ్రీగా వుందాం. కథల చర్చ విషయంలో మాత్రం – మనం రాయబోయే కథల గురించిగాక అచ్చయిన మనకథలగురించి – వివిధ రచయితల కథలగురించి మాత్రవే చర్చిద్దాం!"

"అలాచేస్తే ఇకమీదట మనం రాయబోయే కథల గురించి జాగ్రత్తపడినవాళ్లమవుతాం. బాగానే ఉంది. కాని వాణ్ణి మనమేమీ చెయ్యలేం కదా?"

నరసింహం సందేహానికి శ్రీధర్ నవ్వుతూ –"ప్రతిదానికి ఓ పద్ధతి, మార్గం ఉంటుంది గనుక ఏం చేస్తే వాడి రోగం కుదురుతుందో అందరం బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుని పకడ్బందీగా దాన్ని అమలుచేద్దాం. మళ్లీ మనం కల్సుకున్నప్పుడు ఎవరి ఆలోచనలెలా వున్నాయో? ఏం చేస్తే బావుంటుందో అలా చేద్దాం. ఈ రోజుకి మన బుర్రలు బాగులేవుగనక పోదాం పదండి" అనేసి లేచిపోయాడు శ్రీధర్.

* * *

ఆనవాయితీ ప్రకారంగా ప్రభాకర్ని కలుస్తున్న ఆ ముగ్గురూ అనుకున్న విధంగా తాము రాయబోయే కథల విషయంలో జాగ్రత్తపడుతూ వివిధ రచయితల కథల

తన దృక్పథంలో ఇటీవలే కొంత మార్పొచ్చింది. నిన్నకాక మొన్న కథ్రలాయడానికి పూనుకున్న వారు కూడా సామాజిక స్పృహగల ఇతివృత్తాలనే ఎన్నుకుంటున్నప్పుడు ఎన్నోయేళ్ళ నుంచి రాస్తున్న తనెందుకు అలాంటి కథలు రాయలేదు? తప్పకుండా రాయగలడు. రాసి తీరాలి.



గురించి మాత్రవే చర్చించుకోవడంలో ప్రభాకర్ ఆశ్చర్యంతో నోరుతెరిచి "ఏవిటీ! మీరీమధ్య కథలేవీ రాయటంలేదా?! పరుల కథలగురించి చర్చించుకుంటే మనకేం ప్రయోజనం? మనం రాయబోయే కథలగురించి చర్చించుకుంటే మంచిదికదా?" అడిగాడు.

ముగ్గురూ గురుడి అంతర్యాన్ని పసిగట్టి తన్నుకొస్తున్న కోపాన్ని అణిచిపెట్టుకుని ఎంతోసౌమ్యంగా నిదానంగా "అచ్చయిన మన కథల గురించికూడా చర్చించుకోవచ్చు. దానివల్లకూడా ప్రయోజనం లేదుకదా? ఈ మధ్య మా బుర్రలకి బూజుపట్టిందండీ. వెలకోకథకూడా రాయలేకపోతున్నాం. మీరు రాస్తున్న కథలగురించి చెప్పండి. మాకు తోచిన సలహాలివ్వడానికి మా శాయశక్తులా ప్రయత్నిస్తాం." నరసింహం చెప్పాడు.

కొన్ని క్షణాలు ప్రభాకర్ మౌనం వహించినా ఏదో ఒక సమాధానం చెప్పాలి కాబట్టి నోరు విప్పక తప్పలేదు.

"రాయగల సత్తా ఉండికూడా నే రాయలేకపోతున్నాను. ఈ మధ్య తీరికే దొరకటంలేదు. అంటే అందరం ఒకే పడవలో ప్రయాణిస్తున్నామన్నమాట?" నవ్వేస్తూ అన్నాడు ప్రభాకర్. ముగ్గురూ ఒకర్నొకరు చూసుకున్నారు. చూశారా వీడి కప్పదాటు వ్యవహారం అన్న భావం ఉట్టిపడేలా.

ప్రభాకర్ తన జిప్‌బాక్‌లోంచి ఓ కవరు తీసి నరసింహంకిస్తూ "మీరు రాసిన కథ బాగానే ఉంది కాని

ఇలాంటి థీమ్‌తో కథరాసి ఓ పత్రిక్కి నేనెప్పుడో పంపించడం జరిగింది. ఇద్దరం ఒకే ఊరికి చెందినవారం — పైగా ఎప్పుడూ కల్సుకునేవారం కాబట్టి ఇద్దరం ఒకే థీమ్‌తో కథ్రలాయడం మంచిదికాదు. కాబట్టి కావాలనే నా కథ అచ్చయ్యేదాకా మీ కథ నాదగ్గరుంచేశాను" చెప్పాడు. నరసింహంకి మనసులో మండిపోతున్నా పైకిమాత్రం "చాలా మంచిపన్జేశారు సార్! ఒకే థీమ్ ఇద్దరికీ ఒకేసారి తట్టడం మనం యాదృచ్ఛికమని అనుకోవచ్చు. పాఠకులలా అనుకోరుకదా! ఎనీ హౌ నో ప్రాబ్లెమ్" రానివవ్వుని తెచ్చుకుంటూ అన్నాడు.

"వెరీగుడ్! సరిగ్గానే అర్థం చేసుకున్నారు. ఈ రోజు వాక్యాస్త పమంది. మళ్ళీ కలుద్దాం" అంటూ ప్రభాకర్ వెళ్లిపోయాడు.

* * *

"వెరీగుడ్! నరసింహంగారు కూడా వచ్చేశారు రండిసార్! ఇలా కూర్చోండి! మీకీ విషయం తెల్సా? మనం చోర శిఖామణిగారి ఆటకట్టింది." అప్పుడే వచ్చిన నరసింహంకి శ్రీకాంత్ చెప్పాడు.

"చోర శిఖామణెవరు? ఆట కట్టడమేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు నరసింహం.

"అదేనండీ మన ప్రభాకర్‌గాడి తిక్క కుదిరింది."

"అదెలా!?..." మరింత ఆశ్చర్యపోయాడు నరసింహం.

"స్వరాజ్యం ప్రారంభసంచికకు ఆ సంపాదక వర్గం మంచి కథోటి పంపమంటే — మన గురుడు కథ పంపడం క్రిందటి నెలలో ప్రచురణ జరగడం జరిగింది కదా?"

"అవును"

"ఈనెల స్వరాజ్యంలో పాఠకులు గురుడు పంపిన కథ పదేళ్ళక్రితం 'సాహితీనందనం' అన్న పత్రికలో బహుమతి పొందిన కథ రచయితలపేర్లు తప్పిస్తే రెండూ ఒకటేనని ఇలాంటి కాపీ కథకుల్ని ప్రోత్సహిస్తే పత్రిక పతనాన్ని మీ అంతట మీరే కొనితెచ్చుకున్నట్లవుతుందని దుమ్మెత్తిపోశారు."

"అలాగా!?... అంటే స్వరాజ్యం సంపాదకవర్గం ఈ పాటికి మనవాడికి ఘాటుగా ఉత్తరం రాసుండాలి" నరసింహం ఊహాగానం.

"ఏమో ఆ విషయం మనోడొస్తే తెలియాలి. రెండు కథలూ చదివినమీదట — ప్రభాకర్‌గారు కావాలనే పాతకథకి వేరే కాపీతీసి తనపేర్న పంపించినట్లు తేటతెల్లమైంది గన్క ఇకమీదట ప్రభాకర్‌లాంటి రచయితలకి మా పత్రిక గుడ్‌బై చెబ్తుందని సంపాదకవర్గం ఉత్తరాల శీర్షికలో బాక్సుకట్టి మరీ భరోసా ఇచ్చింది పాఠకలోకానికి" శ్రీకాంత్ చెప్పాడు.

"గురుడికి ఈ దెబ్బతోనైనా బుద్ధిరావాలి. మనం ఏదో చేసి వాడి రోగానికి చికిత్స చేద్దామనుకొన్నాంగాని తన గొయ్యిని తానే తవ్వుకుని మనకు శ్రమలేకుండా చేశాడు" నరసింహం.

"ప్రభాకరొస్తే అన్ని వివరాలూ తెలుస్తాయి." శ్రీకాంత్.

"ఇంత జరిగిం తర్వాత కూడా గురుడు వస్తాడనా మీ అభిప్రాయం? హి వోంట్ కమ్!" అంతవరకు మవునంగా ఉన్న శ్రీధర్ నోరువిప్పాడు.

"ఈ రోజు కాకుంటే మరోరోజైనా మన దగ్గరకు రాకపోడు కదా? అప్పుడైనా కొంతలో కొంతయినా నా విషయం తెలుస్తుందికదా?"

"ఇంతకాలం మనల్ని కేవలం పిల్లుల్లా చూశాడు. తనో పులిలా ప్రవర్తించాడు. పిల్లులు కూడ ఆత్మరక్షణార్థం తమ పంజాల్ని విప్పితే ఏమవుతుందో ఇప్పుడు తెలిసొచ్చింది గన్క ఇంకెప్పుడూ ప్రభాకర్ మనల్ని కల్సుకోడు."

శ్రీధర్ మాటలకి నరసింహం శ్రీకాంత్ ఆశ్చర్యంతో నోళ్లు తెరిచారు.

"మనం ఏదో ఒకటి చేసి వాడి రోగానికి చికిత్స చేద్దామనుకున్నాం. ఎంతో చాకచక్యంగా వాడి గోతిని వాడిచేతే తవ్వించాను. ఆ గోతిలో వాడు పడేటట్లు చేశాను. పదేళ్ల క్రితంనాటి కథను నేనే కాపీ చేసి గురువుగారూ! నాకథను కాస్త దిద్దిపెట్టి ఇవ్వండని — వాడింటికి వెళ్లి మరీ కథని అందించాను. వాడి బుద్ధి వాడు పోనిచ్చుకోలేదు. ఆ కథ అచ్చయినప్పుడు కూడా ఆ కథ గురించి వాణ్ణేమీ అడగలేదు. వాడూ ఆ తర్వాత ఆ కథ గురించి నాదగ్గరేమీ అన్లేదు. వాడి రోగానికి మామూలు చికిత్సకాదు — ఘాటైన శస్త్రచికిత్సే జరిగింది."

శ్రీధర్ మరోసారి ఆశ్చర్యపోయారు ఇద్దరూను.

"అంటే ఉత్తరాల శీర్షికలో సంపాదకవర్గానికి..." నరసింహం సందేహాన్ని అర్థంచేసుకున్న శ్రీధర్ "అవును! ఇక్కడ్నుంచి మరికొన్ని ప్రాంతాలనుంచి నాకు తెల్సినవాళ్లచేత ఉత్తరాలు రాయించాను" అనేసరికి శ్రీకాంత్ నరసింహంల ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి. *




